సాక్షి ప్రకాశం

బుధవారం । 5 । జూన్ । 2024



బహువార్షిక పంటల వైపు రైతన్న మొగ్గు
ఉద్యానవన పంటలకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది.
- 2లో..



వైపాలెంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్
యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ విజయం సాధించింది. తొలిసారి పోటీ చేసిన తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు.
- 2లో..

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.5/27
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

వైఎస్సార్ సీపీకి దర్శి, వైపాలెం

- ఉత్కంఠ నడుమ దర్శిలో బూచేపల్లి విజయం
- యర్రగొండపాలెంలో తాటిపర్తి విజయపతాక
- 6 స్థానాల్లో టీడీపీ గెలుపు
- ఒంగోలు పార్లమెంట్‌లో మాగుంట



డిక్లరేషన్ ఫాం తీసుకుంటున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. దర్శి నుంచి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒంగోలు పార్లమెంట్‌కు సంబంధించి అర్ధరాత్రి వరకూ ఓట్లు లెక్కింపు జరుగుతోంది.టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి 50,531 మెజార్టీ సాధించారు. గత నెల 13వ తేదీన పోలింగ్ జరిగింది. జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు ఉండగా, 15,89,866 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో పురుషులు 7,94,224 మంది, మహిళలు 7,95,566 మంది, ఇతరులు 76 మంది ఓట్లు వేశారు. మొత్తం 87.24 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటలకు ఒంగోలు రైస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమైంది. ఒంగోలు పార్లమెంటు, ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నిర్వహించారు. పటిష్టమైన బందోబస్తు మధ్య లెక్కింపు ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ ఓట్లను లెక్కించారు. 8.30 గంటల తరువాత ఈవీఎంల లెక్కింపును ప్రారంభించారు. 10 గంటలకల్లా ట్రెండ్స్ బయటకు వచ్చాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కనిగిరి, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం కనిపించింది. అయితే కనిగిరి నియోజకవర్గంలో తొలుత హోరాహోరీ పోరు సాగింది. గిద్దలూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రతి రౌండుకు ఉత్కంఠ రేపింది. ఒక రౌండులో వైఎస్సార్ సీపీ, మరొక రౌండులో టీడీపీ ఆధిపత్యం రావడంతో చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. చివరి రౌండులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కుందురు నాగార్జున రెడ్డికి 392 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే పోస్టల్ ఓట్లు లెక్కించగా టీడీపీకి 2,271 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీకి 1,130 ఓట్లు వచ్చాయి. ఈవీఎం ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ సీపీకి వచ్చిన 392 పోగా టీడీపీకి 749 ఓట్ల మెజార్టీ వచ్చింది. దాంతో విజయం చివరికి తెలుగుదేశం అభ్యర్థిని వరించింది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో తొలినుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపత్రి చంద్రశేఖర్ ఆధిక్యాన్ని ప్రదర్శించారు. దర్శిలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి, టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి మధ్య హోరాహోరీ పోరు సాగింది. పోలింగ్ రోజు జిల్లాలో గతంలో ఎన్నడూ లేనట్లు దర్శి నియోజకవర్గంలో ఘర్షణలు జరిగాయి. దాంతో దర్శి ఫలితంపై జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



కౌంటింగ్ కేంద్రంలో ఎస్పీ, కలెక్టర్



మాగుంట శ్రీనివాసులరెడ్డి



దామచర్ల జనార్దన్



డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



ముక్కు ఉగ్రనరసింహారెడ్డి



ముత్తుముల అశోక్‌రెడ్డి



కందుల నారాయణరెడ్డి



బీఎన్ విజయ్‌కుమార్

యర్రగొండపాలెంలో ఎగిరిన వైఎస్సార్ సీపీ జెండా..

పశ్చిమ ప్రకాశం జిల్లాలోని కీలకమైన యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ విజయం సాధించారు. తాటిపర్తికి 90,964 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబుకు 85,487 ఓట్లు పోలయ్యాయి. 5,477 ఓట్ల మెజారిటీతో తాటిపర్తి విజయకేతనం ఎగురవేశారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన బూదాల అజితారావుకు కేవలం 2,166 ఓట్లు మాత్రమే వచ్చాయి. పోలింగ్ మొదలైనప్పటి నుంచి ఇక్కడ తాటిపర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చారు. తొలిరౌండు నుంచి వెనక్కి చూసుకునే పరిస్థితి కలగలేదు.

ఉత్కంఠ రేపిన దర్శి ఓట్ల లెక్కింపు:

పోలింగ్ రోజు ఘర్షణలతో టెన్షన్ క్రియేట్ చేసిన దర్శి నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో కూడా అదే ధోరణి కొనసాగింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ ఆధిపత్యం ప్రదర్శించారు. ఇది 8వ రౌండు వరకు కొనసాగింది. అయితే 9వ రౌండు నుంచి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మికి స్వల్ప మెజారిటీ కనిపించింది. 15వ రౌండు వరకు లక్ష్మి ఆధిపత్యం కొనసాగింది. అయితే ముండ్లమూరు మండల పరిధిలో తెలుగుదేశం పార్టీకి భారీ ఆధిక్యత వస్తుందని ఆ పార్టీ నాయకులు భావించారు. అనుకున్నట్లు ఓట్లు రాలేదు. 16వ రౌండు నుంచి తాళ్లూరు మండల పరిధిలోని ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఇది వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుంది. దీంతో టీడీపీ ఏజెంట్లు సమస్యలు సృష్టించడం మొదలు పెట్టారు. కౌంటింగ్ పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తూ రీ కౌంటింగ్ నిర్వహించాలని కోరుతూ నిరసనకు దిగారు. దీంతో కౌంటింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొద్దిసేపటి తరువాత చివరి రౌండు లెక్కించిన అధికారులు వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి 2,455 ఓట్లతో విజయం సాధించినట్లు ప్రకటించారు. బూచేపల్లికి 1,00,927 ఓట్లు పోలవగా, గొట్టిపాటి లక్ష్మికి 98,330 ఓట్లు వచ్చాయి. చివరి నిమిషం వరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ దర్శి ఎమ్మెల్యేగా డా.శివప్రసాద్ రెడ్డి విజయం సాధించారు. ఆయన 2009 నుంచి 2014 వరకు దర్శి ఎమ్మెల్యేగా పనిచేశారు.

- కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజయం సాధించారు. వైఎస్సార్ సీపీ నుంచి దద్దాల నారాయణ యాదవ్ పోటీ చేశారు. మొత్తం 297 పోలింగ్ బూత్‌లలో 2,04,315 ఓట్లు పోల్ అయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణకు 91,120 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థి ఉగ్రకు 1,05,081 ఓట్లు వచ్చాయి. ఈవీఎంల లెక్కింపులో టీడీపీ అభ్యర్థికి 13,961 ఓట్ల మెజార్టీ రాగా, పోస్టల్ బ్యాలెట్‌లలో 819 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో ఆయనకు 14,770 ఓట్ల మెజార్టీ వచ్చింది. మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. నోటాకు 207 ఓట్లు వచ్చాయి.
- మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి విజయం సాధించారు. 19 రౌండ్ల ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన అన్నా రాంబాబుపై టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి 13,417 ఓట్ల మెజారిటీ రాగా, పోస్టల్ బ్యాలెట్‌లలో 3,283 కలుపుకుని మొత్తం 16,700 మెజార్టీ లభించింది. ఈ ఎన్నికల్లో మొత్తం 1,88,153 ఓట్లు పోల్ అయ్యాయి.
- అన్నా రాంబాబుకు 83,948 ఓట్లు రాగా, కందుల నారాయణరెడ్డికి 97,365 ఓట్లు నమోదయ్యాయి. ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జావీద్ అన్వర్‌కు 2057 ఓట్లు మాత్రమే లభించాయి. మొత్తం 27 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నోటాకు 1308 ఓట్లు పడ్డాయి. మిగిలిన అభ్యర్థులకు డిపాజిట్లు సైతం దక్కలేదు.
- కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి 24,132 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మొత్తం 2,11,787 ఓట్లు పోలయ్యాయి. వీటిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు 91,178 ఓట్లు రాగా, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి 1,15,310 ఓట్లు వచ్చాయి. నోటాకు 1,600 ఓట్లు వచ్చాయి.
- సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున పోటీ చేసిన బీఎన్.విజయకుమార్ 31,105 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 1,87,714 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లో 2,304 ఓట్లు పోలయ్యాయి. వాటిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన మేరుగు నాగార్జునకు 74,652 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు 720 ఓట్లు వచ్చాయి. టీడీపీ తరఫున పోటీ చేసిన బీఎన్ విజయకుమార్‌కు 1,04,326 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు 1431 ఓట్లు వచ్చాయి. మేరుగు నాగార్జునపై బీఎస్.విజయకుమార్ 31,105 ఓట్ల మెజారిటీ గెలుపొందారు.
- ఒంగోలు ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్దన్‌రావు విజయం సాధించారు. దామచర్లకు 1,18,800 ఓట్లు రాగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డికి 84,774 ఓట్లు వచ్చాయి. 34,026 ఓట్ల మెజార్టీతో దామచర్ల గెలుపొందారు.
- ఒంగోలు పార్లమెంట్ నుంచి వైఎస్సార్ సీపీ తరఫున చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీడీపీ తరఫున మాగుంట శ్రీనివాసులరెడ్డి బరిలో ఉన్నారు. అర్ధరాత్రి వరకు ఒంగోలు పార్లమెంట్ కౌంటింగ్ కొనసాగింది. మాగుంట శ్రీనివాసులరెడ్డి సుమారు 50,531 మెజారిటీలో ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రం బయట పోలీసుల పహారా



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



ఈవీఎంలు ఉంచిన పెట్టెలను తెరుస్తున్న సిబ్బంది



ఈవీఎం సీళ్లు తెరుస్తున్న సిబ్బంది



ఓట్ల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది



ఈవీఎంలో ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

ప్రారంభం నుంచే వైఎస్సార్ సీపీ లీడ్



తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌కు కౌంటింగ్ ప్రారంభం నుంచి మెజార్టీ లభిస్తూ వచ్చింది. మొత్తం వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 14 రౌండ్లు, టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబుకు 5 రౌండ్లలో ఆధిక్యం దక్కింది. నియోజకవర్గంలో మొత్తం 265 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సందర్భంగా ప్రతి 14 బూత్‌లను ఒక రౌండుగా విభజించారు. ఈ లెక్కల ప్రకారం మొత్తం 19 రౌండ్లుగా ఓట్లు లెక్కించారు.

రౌండ్ల వారీగా అభ్యర్థులకు లభించిన ఓట్లు, మెజార్టీ

రౌండు	వైఎస్సార్ సీపీ	టీడీపీ	మెజార్టీ/పార్టీ
1	5,104	4,662	442 వైఎస్సార్ సీపీ
2	4,591	4,950	359 టీడీపీ
3	5,192	4,834	358 వైఎస్సార్ సీపీ
4	4167	5,217	1,050 టీడీపీ
5	5,483	4,468	1,015 వైఎస్సార్ సీపీ
6	4,945	4,535	410 వైఎస్సార్ సీపీ
7	4,800	4,846	46 టీడీపీ
8	4,789	5,012	223 వైఎస్సార్ సీపీ
9	4,271	3,969	302 వైఎస్సార్ సీపీ
10	3,877	3,917	40 టీడీపీ
11	4,109	4,125	11టీడీపీ
12	5,200	4,237	963 వైఎస్సార్ సీపీ
13	4,214	3,895	319 వైఎస్సార్ సీపీ
14	4,689	4,311	378 వైఎస్సార్ సీపీ
15	4,888	4,758	130 వైఎస్సార్ సీపీ
16	4,662	4,579	83 వైఎస్సార్ సీపీ
17	5,081	4,369	712 వైఎస్సార్ సీపీ
18	5,600	5,010	590 వైఎస్సార్ సీపీ
19	4,960	3,793	1167 వైఎస్సార్ సీపీ

ఆద్యంతం ఉత్కంఠ

- చివరి నిమిషం దాకా సాగిన దర్శి కౌంటింగ్



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి/కురిచేడు: దర్శి అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. 14 బూత్‌లను ఒక రౌండ్‌గా అధికారులు 14 టేబుళ్ల ఏర్పాటు చేసి లెక్కించారు. మొదటి రౌండ్ నుంచి 17వ రౌండ్ వరకు సజావుగా సాగిన కౌంటింగ్ అక్కడ నుంచి టీడీపీ ఏజంట్లు, నాయకుల గొడవలతో నిలిచిపోయింది. రాత్రి పొద్దుపోయే వరకు ఎలాగైనా దర్శిని కూడా టీడీపీ ఖాతాలో జమ చేసుకోవాలని విశ్వ ప్రయత్నం చేశారు. చివరకు చేసేది లేక వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద రెడ్డి 2597 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

రౌండ్	టీడీపీ	వైఎస్సార్ సీపీ
1	4513	5429
2	5284	4802
3	5222	5057
4	4901	4557
5	5252	5022
6	5393	4835
7	3589	4800
8	4942	3780
9	5113	4796
10	4473	5544
11	4873	3930
12	5108	4604
13	4975	5565
14	4822	5137
15	4628	4403
16	5258	5800
17	5830	5229
18	3677	5673
19	4961	5765
20	4602	5051
21	914	1148
	98330	100927 వైఎస్సార్ సీపీ మెజార్టీ: 2597

కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి..

- కష్టాలను అధిగమించి ప్రత్యర్థితో పోరాడి గెలిచిన తాటిపర్తి
- పోటీ చేసిన తొలిసారే అసెంబ్లీకి



తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 15 సంవత్సరాలుగా నిజాయతీగల కార్యకర్తగా పనిచేసిన తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఫలితం దక్కింది. మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో ఎమ్మెల్యేగా ఆయన ఘన విజయం సాధించారు. సింగరాయకొండలో సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్న ఆయనను గుర్తించిన ఆ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యర్రగొండపాలెం(ఎస్సీ) టికెట్ ఇచ్చి గౌరవించారు. ఆ గౌరవాన్ని నిలుపుకోవటానికి నియోజకవర్గానికి కొత్త అభ్యర్థి అయినా గ్రామ స్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి నాయకుల వరకు ఆయన కలుపుకొనిపోయారు. నాయకుల మధ్య ఉన్న వర్గ విభేదాలను ఆయన ఎంతో సహనంతో పరిష్కరించగలిగారు. అందరినీ సమన్వయ పరచడంలో ఆయన అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. అనతి కాలంలోనే నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తెలుసుకొని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న నీటి సమస్యను వెనువెంటనే పరిష్కరించగలిగారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను తన సొంత నిధులతో మరమ్మతులు చేయించి ఆయా ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. ప్రత్యర్థి టీడీపీ వర్గానికి చెందిన వారు అడుగడుగునా పెట్టిన కష్టాలను ఎదుర్కొంటూ ఆయన ఎన్నికల్లో ముందుకు సాగారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ చేస్తున్న కార్యక్రమాలకు అభ్యంతరం చెప్తూ ఆర్వోకు ఫిర్యాదు చేయడం, కేసులు నమోదు చేయించడం లాంటి కష్టాలను సైతం అధిగమించి ప్రత్యర్థితో పోరాడిన ఆయనను నియోజకవర్గ ప్రజలు 5,477 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. తన స్వగ్రామమైన సింగరాయకొండలో చేసిన స్వచ్ఛంద సేవలు ఈ ఎన్నికల్లో బాగా పనిచేశాయని చెప్పవచ్చు. తాటిపర్తి చంద్రశేఖర్ వదిన, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వనజ, ఆయన భార్య భాగ్యసీమ చౌదరి, కుమార్తె ఆకాంక్ష ఇంటింటికీ తిరిగి చేసిన ప్రచారం నియోజకవర్గ ప్రజలు గుర్తించి వారికి తగిన ఫలితాన్ని అందించారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సచివాలయాల కన్వీనర్లు ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవటానికి తమ స్థాయికి మించి కష్టపడ్డారని చెప్పవచ్చు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల ఇళ్లపై టీడీపీ శ్రేణుల రాళ్లదాడి



గాయపడిన బి.కొండయ్య



చికిత్స పొందుతున్న బాల వెంకటేశ్వర్లు

తర్లుపాడు: మండలంలోని గానుగపెంటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపై టీడీపీ శ్రేణులు రాళ్లదాడికి పాల్పడ్డారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ఈ ఘటనలో గ్రామానికి చెందిన బీ కొండయ్య, ఎ.బాల వెంకటేశ్వర్లు, పి.రాజు, బి.కొండయ్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు నచ్చచెప్పినా వారిపై దురుసుగా ప్రవర్తించారు. క్షతగాత్రులను మార్కాపురం జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

శర్మ కాలేజీ వద్ద దాడి కేసులో ముగ్గురు అరెస్టు



దాడి చేస్తున్న యువకులు

ఒంగోలు టౌన్: శర్మ కాలేజీ ఎదురుగా ఉన్న క్యాంటీన్ వద్ద జరిగిన మూకుమ్మడి దాడి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. 'గత నెల 25వ తేదిన నగరానికి చెందిన పూజల దేవ మేనకోడలు ఫొటోలను కేశవరాజుకుంటకు చెందిన ఒకరు ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ఈ విషయం గమనించిన దేవ కేశవరాజుకుంటకు చెందిన వ్యక్తిని ప్రశ్నించాడు. దీంతో ఆ మరుసటి రోజు సదరు వ్యక్తి అమ్మాయి ఫొటోల గురించి మాట్లాడేందుకు 'మా నాన్న పిలుస్తున్నాడు, శర్మ కాలేజీ వద్దకు రా' అని చెప్పాడు. దాంతో కుమారుడు సుబ్రహ్మణ్యం, అల్లుడు డేవిడ్‌ను వెంటపెట్టుకొని వెళ్లాడు. అప్పటికే అక్కడ దుర్గా ప్రసాద్, భాను ప్రసాద్, జానకి రామయ్యతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. వారి మధ్య మాటా మాటా పెరగడంతో దేవపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి కొట్టారు. అడ్డు వచ్చిన కుమారుడు సుబ్రహ్మణ్యం, అల్లుడు డేవిడ్‌ను చితకబాదారు. 26వ తేదీ ఉదయం జీజీహెచ్ నుంచి వచ్చిన స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేశాం. వన్‌టౌన్ సీఐ షేక్ అలీ సాహెబ్, ఎస్సై కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. సోమవారం నగరంలోని రంగరాయుడు చెరువు వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేశాం. మిగిలిన నిందితులను కూడా త్వరలోనే అరెస్టు చేస్తాం'' అని ఎస్పీ వివరించారు.

బహువార్షిక పంటల వైపు రైతన్న మొగ్గు

- మునగసాగుతో ఉపాధి
- ఉపాధి హామీ పథకం కింద తోటల పెంపకం
- జాబ్‌కార్డ్ ద్వారా వంద రోజుల పనిదినాలు
- ఆర్థిక భరోసా నింపుతున్న తోటలు
- జిల్లాలో 51.59 ఎకరాలలో సాగు
- అన్ని రకాల నేలలు సాగుకు అనుకూలం
- సస్యరక్షణతో మరింత లాభాలు పొందవచ్చంటున్న ఉద్యానాధికారులు

ఒంగోలు సెంట్రల్:

ఉద్యానంటలకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది. మహిళా రైతుల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది. పండ్ల తోటల పెంపకంతో సన్న, చిన్న కారు రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఊతమిస్తోంది. మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేటగిరీ 'బి'లో మునగ తోటల పెంపకం సుస్థిర ఆదాయ మార్గాన్ని పెంచుతోంది.

దక్షిణ భారత దేశంలో పేరుపొందిన బహువార్షిక కూరగాయల్లో మునగ ఒకటి. పెరటి తోటల్లో పెంచుకునే మునగ చెట్ల సాగు ప్రస్తుతం వాణిజ్యపరంగా కూడా ఊపందుకుంది. కాయలతోపాటు మునగ ఆకులను వైద్యపరంగా విరివిగా ఉపయోగిస్తుండటం అందుకు కారణం. జిల్లాలో ప్రస్తుతం 51.59 ఎకరాల్లో మునగ సాగవుతోంది. అందులో త్రిపురాంతకం మండలంలో అత్యధికంగా 15.4 ఎకరాలు , గిద్దలూరు మండలంలో 6.81 ఎకరాలు, మద్దిపాడు మండలంలో 5.07 ఎకరాలు, రాచర్ల మండలంలో 4.31 ఎకరాలు, పెద్దారవీడులో 3 ఎకరాలు, కొమరోలులో 2.22 ఎకరాలు, తర్లుపాడులో 2.36 ఎకరాలు, మార్కాపురంలో 3.06 ఎకరాలు, యర్రగొండపాలెంలో 2.84 ఎకరాల్లో సాగు చేశారు.



దొడ్డవరం వద్ద సాగులో ఉన్న మునగ తోట



గిద్దలూరులో హుస్సేన్‌సాగు చేసిన తోట

స్వల్ప ఉష్ణోగ్రత ప్రాంతాలే అనుకూలం

అన్ని రకాల నేలలో సాగు చేయడానికి అనువైన ఈ పంట 20–25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాలు అనుకూలం. 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో పూత రాలిపోతుంది. మంచు, అధిక చలిని తట్టుకోలేదు. వార్షిక పంట ఎప్పుడు నాటినా వేసవి ప్రారంభంలోనే పూతకు వస్తుంది. గింజలను పాలిథిన్ సంచులలో గానీ లేదా నేరుగా పొలంలో గానీ విత్తుకోవాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో జాఫ్నా, పీకేఎం–1 రకాలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. పీకేఎం–1 రకం నాలుగు నుంచి 6 మీటర్ల ఎత్తు పెరిగి 160–170 రోజుల్లో పూతకు వస్తుంది. కాయ పొడవు 65–70 సెం.మీ, కాయ బరువు 150 గ్రాములు వస్తుంది. ఒక్కో మొక్కకు 220–225 కాయల దిగుబడి వస్తుంది. జాఫ్నా బహు వార్షిక రకం కాయ పొడవు 60–90 సెం.మీ ఉండి మెత్తని గుజ్జు రుచికంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుంచి కాపునకు వస్తుంది. మొదటి రెండు సంవత్సరాలు చెట్టుకు 80–90 కాయలు, నాలుగో సంవత్సరం నుంచి ఏడాదికి 500–600 కాయలు వస్తాయి. అంతర కృషి, ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణలలో మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన శాఖాధికారులు తెలిపారు.

ప్రభుత్వం ప్రోత్సాహం

జాబ్ కార్డు కలిగిన గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించడం ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఆ పనుల్లో కేటగిరీ 'బి'కి సంబంధించిన వ్యక్తిగత ఆస్తులు అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేశారు. ఇందులో భాగంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగి, విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలకు మునగ తోటల పెంపకానికి అవకాశం కల్పించారు. సుస్థిర ఆదాయ మార్గం ద్వారా జీవనోపాధులు పెంచడమే లక్ష్యం కావడంతో లాభదాయకంగా ఉంటోంది. జాతీయ ఉపాధి హామీ పథకం అందిస్తున్న ఉపాధి పనులు, రాయితీలు రైతులకు ప్రోత్సాహకంగా మారాయి.

ఎకరం సాగుకు రూ.50 వేల ఖర్చు



ఒక ఎకరాలో మునగ సాగుకు రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ప్రకృతి సహకరిస్తే ఖర్చులు పోను రూ.60 వేల వరకు మిగులుతుంది. బహు వార్షిక పంట కావడంతో ఉపయోగకరంగా ఉంది.

– హుస్సేన్, రైతు, గిద్దలూరు

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



సాధారణ పంటల సాగులో ప్రకృతి వైపరీత్యాల వల్ల లాభనష్టాలు వస్తుండటంతో బహు వార్షిక పంటల సాగు వైపు రైతులు క్రమేపీ దృష్టి సారిస్తున్నారు. ఉద్యాన పంటలు సాగు చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక లాభాల వైపు రైతులు పయనిస్తున్నారు.

– వై.గోపిచంద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, ఒంగోలు

అధికంగా పొగాకు సాగు చేసి నష్టపోవద్దు

- వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి

ఒంగోలు సెంట్రల్: రైతులు అధికంగా పొగాకు సాగు చేసి బ్యారన్లు నిర్మించి ఇబ్బందులు పడవద్దని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్రం ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి కోరారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పలు దేశాల్లో పొగాకు సాగు తగ్గడం వల్ల మాత్రమే ప్రస్తుతం పొగాకు ధరలు భారీగా వస్తున్నాయన్నారు. రైతులు ఇప్పటి నుంచి అధిక మొత్తంలో కౌలుకు పొలాలు, బ్యారన్లు, కూలీలకు రెట్లు పెంచి ఇబ్బందులు పడవద్దని చెప్పారు. మార్కెట్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచి ధరలకు పొగాకు అమ్ముకోవాలని కోరారు.



మారెడ్డి సుబ్బారెడ్డి

పొగాకు గోదాం దగ్ధం

టంగుటూరు: టీడీపీ కార్యకర్తలు కాల్చిన బాణాసంచా పొగాకు గోదాముపై పడి దగ్ధమైంది. ఈ సంఘటన మండలంలోని జమ్ములపాలెంలో మంగళవారం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..టీడీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చగా అది వెళ్లి పక్కనే ఉన్న అల్లపాటి రాజేష్‌కు చెందిన కేకే మోహన్ ఎంటర్‌ప్రైజెస్ గ్రేడింగ్ గోదాముపై పడింది. నిప్పురవ్వలు పక్కనే ఉన్న పొగాకు చెక్కులకు అంటుకోవడంతో కొన్ని బేళ్లు దగ్ధమయ్యాయి. రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు.



జమ్ములపాలెంలో కాలుతున్న పొగాకు గోదాము

సబ్ జూనియర్స్, జూనియర్స్ ఫుట్‌బాల్ సెలక్షన్స్

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చీరాలలోని ఎస్‌ఆర్ అండ్‌డీఎం హైస్కూలు క్రీడామైదానంలో సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలుర విభాగంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్ బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ విజయకుమార్, నాలుగు జిల్లాల కోఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్‌లు ప్రసన్న, నరేష్‌ల సమక్షంలో నిర్వహించారు. మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ కలిగి ఉన్నట్లయితే మంచి ఉన్నతమైన క్రీడాకారులుగా ఎదుగుతారని వారు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారని వారు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు బుధవారం గుంటూరులో జోనల్ మీట్‌లో ఆడతారని తెలిపారు.

వైపాలెంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ విజయం సాధించింది. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుతూనే ఉన్నారు. 2009లో యర్రగొండపాలెం నియోజకవర్గం(ఎస్సీ) ఆవిర్భవించింది. మహానేత వైఎస్సార్ పిలుపు మేరకు రైల్వే శాఖలో ఉన్నత ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగారు. సురేష్ రాజకీయలకు కొత్త అయినప్పటికీ వైఎస్సార్‌పై ఉన్న అభిమానంతో నియోజకవర్గ ప్రజలు ఆదరించి 13,194 ఓట్ల మెజారీతో గెలిపించారు. వైఎస్సార్ మరణానంతరం, ఆనాటి రాజకీయ పరిస్థితుల వల్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. పార్టీ ఆవిర్భావం తరువాత 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పాలపర్తి డేవిడ్‌రాజును ప్రజలు ఆదరించడంతోపాటు 19,071 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. అయితే డేవిడ్ రాజు పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరారు. ఆనాడు సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఉన్న ఆదిమూలపు సురేష్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కార్యకర్తలకు అండగా నిలిచారు. 2019లో ఆయనకే వైఎస్సార్ సీపీ టికెట్ దక్కడంతో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు 31,632 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిమూలపు సురేష్‌కు రెండు పర్యాయాలు కీలక మంత్రి పదవులు ఇచ్చి నియోజకవర్గ ప్రజలను గౌరవించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయించి జాతికి అంకితం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో నడిపేందుకు నిధులను కేటాయించారు. పుల్లలచెరువు మండల ప్రజలకు తాగు, సాగు నీటి వసతి కల్పించేందుకు తీగలేరు–5 కాలువకు రూ.32 కోట్ల నిధులకు అడ్మినిస్ట్రేషన్ అనుమతులిచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలతో ప్రతి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసి ఆ పల్లె ముంగిటకు పాలనను తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల వైద్యశాలను నిర్మించారు. నవరత్నాల పథకాలు అమలుచేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా దాదాపు 1.80 లక్షల మందికి లబ్ధి చేకూర్చారు. అనేక అభివృద్ధి పనులతో నియోజకవర్గం ముందుకు సాగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్‌ను పోటీలో దింపారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఓట్ల లెక్కింపు మంగళవారం చేపట్టగా 5,477 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. దీంతో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ సాధించినట్టయింది.



విజయంతో కౌంటింగ్ కేంద్రం నుంచి వెళుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

వార్డు సచివాలయానికి పసుపు రంగు

ఒంగోలు: ఎన్నికల కోడ్ ఇంకా ముగియలేదు. 144 సెక్షన్ అమలులో ఉందంటూ పోలీసులు మైకులు పెట్టి హెచ్చరిస్తున్నా టీడీపీ నాయకులు దూకుడుగా వ్యవహరించారు. సచివాలయాలకు వైఎస్సార్‌సీపీ రంగులు వేస్తున్నారంటూ గతంలో కోర్టుల్లో కేసులు వేసిన టీడీపీ నేతలు మాత్రం నేడు వాటికి పసుపు రంగు వేసేందుకు ఏమాత్రం సంశయించలేదు. మంగళవారం ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడగానే ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని ముక్తినూతలపాడులోని వార్డు సచివాలయానికి టీడీపీ నేతలు పసుపు రంగు వేశారు. టీడీపీ నేతలకు అభ్యంతరం చెప్పలేక అధికారులు ఉత్సవ విగ్రహాల్లా నిల్చున్నారు.



పతకాల ఉడుంపట్టు

- రెజ్లింగ్‌లో సత్తా చాటుతున్న వెలుగొండ విద్యార్థులు
- గురుకులాల స్థాయి పోటీల్లో ఐదేళ్లలో 103 పతకాలు కైవసం

కొనకనమిట్ల: భుజ బలం.. ఉడుంపట్టు.. నైపుణ్యం కలగలిపిన ఆట రెజ్లింగ్. కండలు తిరిగిన పహిల్వాన్ల ఆటగా పేరొందిన రెజ్లింగ్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ ఏదైనా బరిలోకి దిగారంటే పతకాలు సొంతం చేసుకుంటున్నారు. కొనకనమిట్ల మండలంలోని వెలుగొండలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గత ఐదేళ్లుగా గురుకుల పాఠశాలల స్థాయిలో నిర్వహిస్తున్న రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని 103 పతకాలు సాధించారు.

కఠోర సాధన

పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు రెజ్లింగ్‌ను ఇష్టపడి కఠోన సాధన చేస్తున్నారు. వారిలో ఉత్సాహాన్ని చూసిన పాఠశాల పీడీ, పీఈటీలు రాజ్‌కుమార్, చంద్రశేఖర్, ఖాదర్‌బాషా క్రీడాకారులకు రెజ్లింగ్‌తోపాటు ఆటల పోటీల్లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల చిత్తూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఇట్లా శివయ్య, ఆర్. విష్ణువర్ధన్, డి.మహంత్ అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో శివయ్య బంగారు పతకం సాధించి జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపియ్యాడు. విష్ణువర్ధన్, మహంత్ బహుమతులు సాధించారు. ఈ ఏడాది ప్రారంభంలో అనంతపురం జిల్లాలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల క్రీడాకారులు స్వర్ణ పతకం సాధించి ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది ఝార్ఖండ్‌లో నిర్వహించిన అండర్–15 పోటీల్లో శ్రీరాం, శివయ్య రెండు స్వర్ణ పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. విద్యార్థులు పోటీల్లో రాణించడం వెనుక పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, ప్రస్తుత ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, పీడీల కృషి కూడా ఉంది.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు



బహుమతులతో పాఠశాల క్రీడాకారులు

పాఠశాలకు మంచిపేరు తెచ్చారు

గత ఐదేళ్లలో మా పాఠశాల విద్యార్థులు రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని 103 బంగారు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు రెజ్లింగ్ పోటీలో మంచి తర్ఫీదు ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి పాఠశాల పూర్వ పీడీ రాజ్‌కుమార్, పీఈటీలు చంద్రశేఖర్, ఖాదర్‌బాషా చాలా కృషి చేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందనలు.

– వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్



స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూనే రెజ్లింగ్‌పై ఇష్టంతో మెళకువలు నేర్చుకుంటున్నాం. క్రీడల్లోనూ సత్తా చాటుతుండటంతో వారిని మరింత ప్రోత్సహించి అండగా నిలుస్తున్నారు. ఇటీవల నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న ఇద్దరూ బంగారు పతకాలు సాధించటం విశేషం.



– శివయ్య, మహంత్, క్రీడాకారులు